క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వెదురుకుప్పం: రెవెన్యూ పరమైన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ నాగరాణితో కలిసి సందర్శించారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరు, హాజరు, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదుల పైనా ఆరా తీశారు. అలాగే కార్యాలయ రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది కొరతను స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అధికారులు జగనన్న కాలనీని పరిశీలించారు. పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయించి రాళ్లు నాటాలని సర్పంచ్ భారతి తహసీల్దార్‌కు విన్నవించారు. అదేవిధంగా మొరవలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణ చోటుచేసుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జగనన్న కాలనీలో త్వరలోనే లబ్ధిదారులకు హద్దులు చూపి రాళ్లు నాటేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం తగదని వెంటనే పరిష్కరించాలని వీఆర్‌ఓను ఆదేశించారు. డీడీఓ కేశవు లు, సచివాలయ సిబ్బంది, నాయకులు రాము, విజయశేఖర్ రెడ్డి, గణపతి రెడ్డి పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



క్షయవ్యాధి గ్రస్తులకు ప్రధానమంత్రి కిట్టు అందిస్తున్న డాక్టర్ రవిరాజు

విజయపురం (నగరి) : టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి ముఖ్య ఉద్దేశమని అందులో భాగంగానే ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ రవిరాజు అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో క్షయవ్యాధిగ్రస్తులకు టీబీ ముక్త్ భారత అభియాన్ కిట్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1100 మంది క్షయవ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి నెల పౌష్టికాహారం అందిస్తున్నామని, ఇప్పటికే మూడు విడతలు పంపిణీ చేశామన్నారు.

స్వచ్ఛందంగా ముందుకు రండి ..

రెండు వారాలు పైగా దగ్గు ఉంటే టీబీ టెస్టు చేయించుకోవాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ రవిరాజు అన్నారు. గ్రామస్థాయిలో ఉన్న ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు తెలియజేయాలన్నారు. ముందుగా పరీక్ష చేసుకుంటే టీబీని అరికట్టవచ్చన్నారు. కొందరు వ్యాధిని దాచిపెట్టడం ద్వారా టీబీ ఎక్కువ అవుతుందన్నారు. అనుమానం ఉంటే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం 20 మంది క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్టు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓగా ఆంజనేయులుశెట్టి



ఆంజనేయులుశెట్టి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): గంగాధరనెల్లూరు ఎంఈఓగా ఆంజనేయులు శెట్టి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన పుంగనూరు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై గంగాధరనెల్లూరు ఎంఈఓగా వచ్చారు. గతంలో ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న రాజేంద్రన్ బంగారుపాళెం ఎంఈఓగా బదిలీపై వెళ్లారు.


గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



కృష్ణయ్య (ఫైల్)

పుత్తూరురూరల్: వడమాలపేట మండలం పాదిరేడు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణయ్య (60) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మండల పరిధిలోని కదిరిమంగళం గ్రామానికి చెందిన కృష్ణయ్య గత 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. ఎంఈఓలు పద్మావతి, తులసీరామ్, ఇతర ఉపాధ్యాయులు గ్రామానికి వెళ్లి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నగరిలో..



నివాళులు అర్పిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : మున్సిపల్ పరిధిలోని నెత్తంకండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు దేవిక మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతికి పాఠశాలలో ఎంఈఓ శ్రీదేవి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు. దేవిక పనితీరు, వృత్తి పట్ల నిబద్ధతతో ఆమె ప్రవర్తించిన తీరును స్మరించుకున్నారు.

పైసా ఖర్చులేకుండా..



నా పేరు రాధిక, 7వ వార్డ్, టీఆర్ కండ్రిగ. పైసా చెల్లించకుండా నేడు ఆదాయ ధ్రువీకరణ పత్రం అందుకున్నా. వలంటీర్లు, గృహసారథి, కౌన్సిలర్, సచివాలయ సిబ్బంది అంతా మా ఇంటి వద్దకు విచ్చేసి 11 సర్వీసులు ఉచితంగా చేస్తున్నాం.. మీకు ఏది అవసరమో చెప్పండి అంటూ అడిగి మరీ సర్టిఫికెట్ ఇచ్చారు. ఎలాంటి ఖర్చు లేకుండా నాకు సర్టిఫికెట్ అందింది. ఇంతసాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, మంత్రి రోజమ్మకు ధన్యవాదాలు.

అడిగి మరీ ఇచ్చారు..



నా పేరు జమున, 5వ వార్డు, నగరి కాలనీ, జగనన్న సురక్షలో భాగంగా ఇంటివద్దకు విచ్చేసిన వలంటీర్, కౌన్సిలర్, సచివాలయ సిబ్బందికి కులధ్రువీకరణ పత్రం కావాలని విన్నవించుకున్నాను. ఈరోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా, రూపాయి తీసుకోకుండా సర్టిఫికెట్లు ఉచితంగా పొందాను. సీఎం జగనన్నకు థ్యాంక్స్.

ఉచితంగా ఇచ్చారు..



నా పేరు రాధ, 7వ వార్డు, టీఆర్ కండ్రిగ, జగనన్న సురక్షలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పదిరోజుల పాటుగా వార్డంతా ఇంటింటికీ తిరుగుతున్నారు. ఎవరికి ఏ అవసరం ఉందో తెలుసుకున్నారు. నాకు ఆదాయ ధ్రువీకరణ పత్రం కావాలని వారికి వివరించాను. అందుకు అవసరమైన పత్రాలు అందజేశాను. జగనన్న సురక్ష క్యాంపులో నేడు ఉచితంగా ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇచ్చారు.

వాడవాడలా ప్రభుత్వ సేవలు



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారితో మున్సిపల్ చైర్మన్, అధికారులు



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారితో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

- జగనన్న సురక్ష క్యాంపుల్లో అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం
- భారీగా తరలివస్తున్న జనం
- ధ్రువీకరణ పత్రాలు, బియ్యంకార్డులు ఏవైనా ఉచితంగా అందజేస్తున్న అధికారులు
- బుధవారం నాడు 715 మందికి వివిధ ధ్రువపత్రాల అందజేత



నగరి మున్సిపాలిటీ టీఆర్ కండ్రిగలో క్యాంపునకు హాజరైన లబ్ధిదారులు

నగరి : అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన సర్టిఫికెట్లు, సంక్షేమం పైసా ఖర్చు లేకుండా వెతుక్కుంటూ రావడంతో జగనన్న సురక్ష క్యాంపుల వద్ద జనజాతర కనిపిస్తోంది. బుధవారం మున్సిపల్ పరిధిలోని 6, 7 వార్డులకు సంబంధించి టీఆర్ కండ్రిగ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఒక్కరోజులోనే 715 సర్టిఫికెట్లు జారీచేశారు. వీటిలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 281, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 429, విభజించిన రేషన్‌కార్డులు 2, అదనపు సభ్యులను చేర్చిన రేషన్ కార్డు 1, కొత్త బియ్యంకార్డులు 2 అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కార్యదర్శులు మీ ఇళ్ల వద్దకే వచ్చి మీ అవసరాలను తెలుసుకుని, అందుకు కావలసిన అర్హతలను పరిశీలించి ఎటువంటి రుసుము లేకుండా మీ చెంతకే వచ్చి ఫలాలు అందిస్తున్నారంటే ఇది నిజంగా సువర్ణ పాలనే అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కార్యదర్శి దయానిధి, కౌన్సిలర్లు గాయత్రి, సాయిసంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, దేశమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, డీఈ నరేష్, నాయకులు రామకృష్ణ, శశికళ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని దామరపాకం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు జారీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సేవలు గతంలో ఎన్నడూ జరగలేదని ముఖ్యమంత్రి జగనన్న ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీడీఓ లీలామాధవి, మండల సచివాలయ కన్వీనర్ హరి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శమూర్తులు గురువులే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ నాగరాణి, స్థానిక నాయకులు

వెదురుకుప్పం: సమాజానికి ఆదర్శమూర్తులు గురువులేనని ఎంపీపీ నాగరాణి అన్నారు. మండలంలోని రెంటాలచేను ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు వెంకటరమణమ్మ, గోవిందస్వామి, కోదండయ్య, అక్బర్ సాహెబ్, వాణి, ధనుంజయులు బదిలీపై వెళ్లారు. బుధవారం పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎక్కడికెళ్లినా గురుతర బాధ్యతలను నిర్వహించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. అంతకుముందు పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. నాణ్యమైన భోజనం తయారు చేసి పిల్లలకు పెట్టాలని వంటి సిబ్బందికి సూచించారు. అదేవిధంగా వెదురుకుప్పం జెడ్పీహైస్కూల్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలయ్యపల్లె ఎంపీటీసీ సభ్యురాలు హరి, హెచ్‌ఎం రేణుకదేవి, ఉపాధ్యాయులు సుభాష్‌రెడ్డి, లావణ్య, సురేష్, స్థానిక నాయకులు విజయశేఖర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో తప్పని కష్టాలు



పోలీసులు అడ్డుకోవడంతో ఆగిన అంతిమ సంస్కరణ

పుత్తూరు రూరల్: అంతిమయాత్రలో సమస్య తలెత్తడంతో నాలుగు గంటల పాటు పుత్తూరులో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పుత్తూరు మున్సిపాలిటీ 27వ వార్డు ఈశ్వరాపురం హరిజనవాడకు చెందిన కృష్ణయ్య (95) అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో హరిజనవాడకు ఎదురుగా గల ఏపీ టూరిజం పున్నమి హోటల్‌కు చెందిన భూమిలో అంత్యక్రియలు చేయడానికి కుటుంబసభ్యులు వెళ్లారు. అప్పటికే ఏపీ టూరిజం యాజమాన్యం, సమీపంలోని మహాలక్ష్మీపురం, తిమ్మాపురం గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అంత్యక్రియలను అడ్డుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి ఇదివరకు వినియోగిస్తున్న శ్మశాన స్థలంలోనే అంత్యక్రియలు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అయితే దీనిపై వాదనలు జరుగుతుండానే సాయంత్రం 6 గంటల సమయంలో గ్రామస్తులు శవాన్ని తీసిన గోతిలోనే పూడ్చివేశారు. ప్రస్తుతానికి సమస్య సద్దుమణిగినా ఈశ్వరాపురం హరిజనవాడకు శ్మశాన స్థలాన్ని అధికారికంగా కేటాయించి, దారి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది.



గ్రామస్తులతో చర్చిస్తున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి

ఆలయ అభివృద్ధికి సహకరించండి



ఆలయ పరిశీలనలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి

- ఆలయంలో శుభకార్యాల నిర్వహణకు అనుమతి
- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థసారథి

నగరి : తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధీనంలో ఉన్న స్థానిక భూదేవి, శ్రీదేవి సమేత శ్రీకరియమాణిక స్వామి ఆలయం అభివృద్ధిలో అందరూ పాత్రులు కావాలని టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థసారథి అన్నారు. ఆలయంలో నిత్య కైంకర్యాల తనిఖీ నిమిత్తం బుధవారం ఆయన ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద ఉభయదారులు ఆలయానికి సంబంధించిన పండుగలు, ఉత్సవాల్లో పాల్గొనే సౌకర్యాన్ని టీటీడీ కల్పిస్తోందన్నారు. ఆలయానికి రూ.1000 విరాళం ఇచ్చేవారికి 3 సంవత్సరాల వరకు, ఏడాది 5 రోజుల అర్చన, హారతి ఇచ్చి 250 గ్రాముల ప్రసాదం, రూ.5 వేలు విరాళం ఇచ్చేవారికి 5 ఏళ్లపాటు వరకు ఏడాదిలో 30 రోజుల దాతలు, కోరిన 30 రోజులు అర్చన, హారతి ఇచ్చి 250 గ్రాముల ప్రసాదం అందించడంతో పాటు ఒక్కసారి ఉత్తరీయ సత్కారం చేస్తామన్నారు. రూ.10 వేలు విరాళం ఇచ్చేవారికి 10 ఏళ్ల వరకు నిత్యార్చన, ఏడాదిలో దాతలు కోరిన 30 రోజుల అర్చన, హారతి ఆశీర్వచనం, 250 గ్రాముల ప్రసాదం, పట్టు శాలువతో సత్కారం జరుగుతుందన్నారు. అలాగే ఆలయంలో నిశ్చితార్థములు, పెళ్లిళ్లు, అన్నప్రాసన మొదలగు శుభకార్యాలు నిర్వహించుకోవడానికి అనుమతిస్తున్నామని తెలిపారు. విందులు మాత్రం ఆలయంలో నిర్వహించరాదన్నారు. ఆలయంలో ఊంజల్‌సేవను త్వరగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ రమేష్, స్థానిక ఆలయ అధికారులు వెంకటరమణ, ప్రధాన అర్చకులు ధన్వంతరి ఆచార్యులు, వేద పారాయణ పండితులు రాంప్రసాద్ ఆచార్యులు, స్థానిక ఆలయ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

పాలసముద్రం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నే విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నామని బలిజకండ్రిగ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రుషు తెలిపారు. బుధవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నూతనంగా బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రులతో ఆయన సమీక్షించారు. బలిజకండ్రిగలో ప్రభుత్వం గతేడాది బాలికల జూనియర్ కళాశాల ప్రారంభించిందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తోందని ఎంఈఓ-2 మనోజ్ కుమార్ అన్నారు. బుధవారం మేజర్ పంచాయతీ పరిధిలోని కార్వేటినగరం పెద్ద దళితవాడ, పద్మసరస్సు ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. స్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

ఘనంగా కుంభాభిషేకం

నింద్ర: మండలంలోని ఉరూరుపేట గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన వినాయక ఆలయంలో కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, కలశపూజ చేపట్టారు. అనంతరం ఆలయ అర్చకులచే పూర్ణాహుతి, అర్చనలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో వినాయక స్వామి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దస్తగిరి కథనం మేరకు, మండలంలోని తురుమిట్ట గ్రామానికి చెందిన వంశీ కార్వేటినగరం వైపు నుంచి స్వగ్రామానికి బైక్ మీద వెళుతుండగా, అల్లూరు సమీపంలోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద లారీ ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అష్టబంధన కుంభాభిషేకం



కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న మంత్రి ఆర్‌కే రోజా

- వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఆర్‌కే రోజా
- వేదపండితుల ఆశీర్వచనం



కలశ ప్రదక్షిణలో మంత్రి ఆర్‌కే రోజా

నగరి : మున్సిపల్ పరిధిలోని కాకవేడు ఆదిఆంధ్రవాడలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయ అష్టబంధన మహా కుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల ఉచ్చరణలు ఆలయం వద్ద హోరెత్తాయి. ఈ ప్రాంతంలో మాతమ్మ ఆలయ నిర్మాణం కోసం దశాబ్దాలుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. మంత్రి ఆర్‌కే రోజా స్థానికుల కోరిక మేరకు ప్రత్యేక చొరవ తీసుకుని టీటీడీ ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించడంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరిగింది. దశాబ్దాల కల ఫలించడంతో ఈ కుంభాభిషేక ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి ఆర్కేరోజా యాగశాల పూజల్లో, యాత్రాదానం, మహాపూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం కలశ ప్రదక్షిణ చేసి గోపుర శిఖరంపైకి చేరుకుని శిఖరానికి అభిషేకం చేశారు. అభిషేక జలం పైన చల్లుకోవడానికి స్థానికులు పోటీపడ్డారు. కుంభాభిషేక అనంతరం వేదపండితులు ఆలయంలోని మాతమ్మ విగ్రహానికి మహాభిషేకం చేసి సుందరంగా అలంకరించగా అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. వేద పండితులు మంత్రికి ఆలయ ప్రసాదాలు అందించి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణంలో సహకారం అందించిన మంత్రికి వార్డు కౌన్సిలర్ గురమ్మ, మునికృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, దేశమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, నాయకులు ఎన్‌సీ ఆనంద్‌కుమార్, కృష్ణమూర్తి, ఎల్లప్పరెడ్డి, సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు



అర్హులకు ధ్రువపత్రాలను అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : ప్రజల వద్దకు పాలనను తీసుకొచ్చే గొప్ప కార్యక్రమం 'జగనన్న సురక్ష' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని విలాసవరహాపురం, శ్రీరంగరాజపురం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ పథకం పొందని అర్హత ఉన్నవారిని గుర్తించి వారికి పథకాలు అందించడంతో పాటు 11 రకాల సేవలను ఉచితంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికంగా బలోపేతం అవుతున్న పేదలు మరోసారి వైఎస్సార్‌సీపీ పాలన కోరుకుంటున్నారని చెప్పారు. జగనన్న సురక్ష తరహా అత్యంత ప్రయోజనకరమైన కార్యక్రమం దేశంలో మరెక్కడా అమలులో లేదన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందించడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు సత్యలత మాట్లాడుతూ కూలికి పోతేనే మా కుటుంబం జీవనం గడుస్తుందని, నేడు సీఎం జగనన్న పుణ్యమా అని నా పిల్లలు బాగా చదువుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేసింది. ఈ మాటలను విన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తల్లిదండ్రులు ఇదే విషయం చెబుతున్నారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రెడ్డి, సుబ్రమణ్యం, తహసీల్దార్ లోకనాథపిళ్లై ఎంపీడీఓ కృష్ణయ్య, మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ మాజీసభ్యులు గురవారెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, హరిత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లత అన్నారు. బుధవారం గొపిశెట్టిపల్లి, అలత్తూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను ఎంపీపీ లత ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్‌లు, చిన్న సర్వేశ్వర్, ఎంపీటీసీ మురగయ్య, సచివాలయ కన్వీనర్ పురంధర్, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్‌రాజు పాల్గొన్నారు.

పుష్పయాగానికి అంకురార్పణ



అప్పలాయగుంటలో సేనాధిపతి ఉత్సవం



మేదినిదేవికి పూజలు చేస్తున్న ప్రధాన అర్చకులు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పుష్పయాగ కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. మాడవీధుల్లో మేళతాళాల మధ్యన సేనాధిపతి ఊరేగింపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిని ఆలయం నుంచి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్టమట్టిని మేదినిదేవి రూపంలో అలంకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

నేడు పుష్పయాగం..

పుష్పయాగంలో భాగంగా గురువారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం ఉంటుందని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం ఉంటుందని, కార్యక్రమంలో వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అభిషేకిస్తామన్నారు. అనంతరం తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు.